

## బిజ్జుల వారు ఏలిన

# అలంపురం PART - I

(తెలంగాణ సంస్థానాలు : పద్నాలుగో భాగం)

**కృష్ణా, తుంగభద్ర నదుల మధ్య, వనపర్తి, గద్వాల, కొల్లాపూర్ సంస్థానాల నడుమ గల అలంపురం సీమను వెన్నోళ్ల గోత్రానికి చెందిన మొటాటి రెడ్లు అయిన బిజ్జుల వంశీయులు పాలించారు. ప్రాగటూరు కేంద్రంగా వీరు పాలన సాగించినట్లు ఆ వంశంలో 17వ శతాబ్దానికి చెందిన కవిరాజు బిజ్జుల తిమ్మభూపాలుడు తన 'అనర్ఘరాఘవము'లో రాశాడు. అలంపూర్‌కు 20 కిలోమీటర్ల దూరంలో కృష్ణా నదీ తీరాన ప్రాగటూరు ఉంది. ప్రాగటూరు తర్వాత బిజ్జుల వారి పాలన పల్లెపాడు కేంద్రంగా సాగింది.**


**నగేష్ బీరెడ్డి**
**ఫీచర్స్ ఎడిటర్, నమస్తే తెలంగాణ**
**సెల్ : 8096677177**


బిజ్జుల వారు కాలచూరుల వంశం నుంచి మొదలైన వారు. వీరి ఉనికి మధ్య భారతంలో ఉన్నట్లు చరిత్రకారుడు పి.బి. దేశాయ్ వెల్లడించారు. మహాభారతంలో అశ్వత్థామ శిష్యుడైన సోమ కాలచూరి వారి మూలపురుషుడిగా ఈ వంశీయులు చెబుతుంటారు. మాల్వ, గుజరాత్ కొంకణ, మహారాష్ట్ర ప్రాంతాలను పాలించిన కాలచూరులు అటు తర్వాత దక్షిణ పథానికి వలస వచ్చారు.

మంగళ్వాడ రాజధానిగా కళ్యాణి (బసవ కళ్యాణ్, కర్ణాటక)ని పాలిస్తున్న పశ్చిమ చాళుక్యులకు కాలచూరులు సామంతులుగా ఉండేవారు. క్రీ.శ. 1047లో ఒకటో సోమేశ్వరుడు రాజధానిని కళ్యాణ్‌కు మార్చాడు. అప్పటి నుంచి వారు కళ్యాణి చాళుక్యులయ్యారు. వీరు రాష్ట్రకూటులను జయించిన తర్వాత క్రీ.శ. 1151లో మూడో తైలపుడు చాళుక్య రాజయ్యాడు. ఇతడు అధికారంలోకి రాగానే సామంత రాజులు కాలచూరులు, కాకతీయులు, హొయసాల, యాదవులు స్వాతంత్ర్యం ప్రకటించుకున్నారు. వీరందరినీ ఏకం చేసి కాలచూరి బిజ్జులదేవుడు సరికొత్త యుద్ధతంత్రం రచించాడు. కాకతీయ రాజు రెండో ప్రోలుడు తైలపదేవుడిని యుద్ధంలో ఓడించాడు (ఆ కథనాన్ని మన చరిత్ర 15, 16 భాగాల్లో విపులంగా చదువొచ్చు). చివరికి క్రీ.శ. 1162లో హొయసాల వీర నరసింహుడి చేతిలో తైలపదేవుడు మరణించాడు. కాలచూరి, కాకతీయ, హొయసాల, యాదవ రాజ్యాల ఏర్పాటుకు తైలపదేవుడి మరణం నాంది అయ్యింది. పశ్చిమ చాళుక్య రాజ్య పతనంలో బిజ్జులదేవుడిది ప్రధాన భూమిక అయ్యింది. ఈ కాలచూరి బిజ్జులునికి నాలుగో తరం వాడు దాదిరెడ్డి. అలంపురం సంస్థానాన్ని పాలించిన బిజ్జుల వంశీయులకు ఇతడే ఆద్యుడు. ఇతనినే దాది భూపాలుడు అని కూడా అంటారు.

క్రీ.శ. 1516లో దాదిభూపాలుడు విజయనగర సామ్రాజ్య సైన్యాన్ని ఓడించి రాయచూరు (కర్ణాటక) కోటను స్వాధీనం చేసుకున్నాడు. ఆ సమయంలో కృష్ణదేవరయాల సైన్యం ఒరిస్సా ప్రాంతంలో నిమగ్నమై ఉంది. బీజాపూర్ నవాబు దాదిభూపాలుని సాహసానికి ముగ్ధుడై బహుమానం ఇవ్వాలనుకున్నాడు. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు దాదిభూపాలుడు ఎంత ప్రయాణించగలిగితే అంత ప్రాంతాన్ని బహూకరించి 'రెడ్డి' అనే బిరుదు ఇస్తానన్నాడట. దీంతో దాదిభూపాలుడు రాయచూరు కోట నుంచి బయలు దేరి అలంపురం(జోగులాంబ గద్వాల జిల్లాలో అలంపూర్ పట్టణం), మీదుగా ప్రయాణించి సూర్యాస్తమయానికి 'పాన్యాగ్రహపాడు' అనే ఊరు చేరాడట. అదే

## మన చరిత్ర-70


బిజ్జుల వారి కోట (నీట మునగక ముందు నాటి చిత్రం)

నేటి పల్లెపాడు (జోగులాంబ గద్వాల జిల్లా మనోపాడ్ మండలంలోనిది) గ్రామం. బీజాపూర్ నవాబు ఈ మొత్తం ప్రాంతాలపై దాదిరెడ్డికి సర్వ హక్కులు ఇచ్చాడట. ఇందుకుగాను బీజాపూర్ పాలకులకు దాదిరెడ్డి కావాల్సిన సహాయం అందిస్తుండేవాడు.

అటుతర్వాత కృష్ణదేవరాయలు పది లక్షల మంది సైన్యంతో, 500 ఏనుగులతో రాయచూరు కోటను ముట్టడించాడు. అప్పుడు బీజాపూర్ నవాబు శక్తివంతమైన అశ్వదళంతో దాదిరెడ్డికి సహాయంగా వచ్చాడు. ఈ యుద్ధంలో కృష్ణదేవరాయలు పోర్చుగీసు వారి సహాయంతో గెలిచి కోటను స్వాధీనం చేసుకున్నాడు. ఈ యుద్ధం(క్రీ.శ. 1520)లో దాదిరెడ్డి మరణించాడు. ఈ విషయాన్ని అక్కడి కోటలో కూడా శిలాశాసనంగా చెక్కారు. రాయచూరు కోటను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తూ, తన ప్రాణాలను కోల్పోయిన వీరుడైన దాదిరెడ్డి కథను నాట్య రూపకంగా, నాటక రూపకంగా నేటికీ అక్కడి ప్రజలు ప్రదర్శిస్తుంటారు.

దాదిరెడ్డి కుమారుడు కృష్ణారెడ్డి అలంపూరు కేంద్రంగా చేసుకొని పాలించేవాడు. ఈయన తర్వాత ఐదు తరాల వారు కూడా పాలన సాగించారు. వీరు శైవ మతస్థులు. అలంపూరులోని శివాలయాలను పునరుద్ధరించారు. వీరి వారసులలో చివరి వాడైన కొండారెడ్డి (క్రీ.శ. 1597 – 1643) పేరు మీదే కర్నూలు పట్టణంలోని రెడ్డి బురుజుకు ఆ పేరు వచ్చిందని చెబుతారు. కొండారెడ్డి గోల్కొండ నవాబులను ఎన్నోసార్లు యుద్ధంలో ఓడించాడు. చివరకు ఒకసారి వారికి పట్టుబడడంతో నవాబులు కొండారెడ్డిని బంధించి ఆ కోటలో ఉంచారట. కొండారెడ్డి ఎంతో చాకచక్యంగా కోటలో నుంచి అలంపూరుకు ఉన్న సొరంగ మార్గం గుండా తప్పించుకున్నాడట. గోల్కొండ నవాబుల చేతిలో రాజ్యాన్ని కోల్పోయిన తర్వాత బిజ్జుల వారి ఉనికి అలంపూరు నుంచి ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాగటూరు కేంద్రంగా కనిపిస్తున్నది. ఇక్కడ వారు క్రీశ. 1665లో కోటను నిర్మించి సుమారు 100 గ్రామాలను కలిపి అలంపూరు సంస్థానంగా పాలన సాగించారు. వీరు ఈ సమయంలో స్వతంత్ర పాలకులుగానే ఉన్నారు. ఈస్ట్ ఇండియా కంపెనీ కర్నూలు, చుట్టుపక్కల ప్రాంతాలను నిజాముల నుంచి తీసుకున్నారు, కానీ ప్రాగటూరును ముట్టుకోలేదు. నిజాం ఖమురుద్దీన్ పాలనా కాలంలో తన బంధువైన షాహ్ యారుల్ ముల్క్‌కు అలంపూరు పరగణాను జాగీరుగా ఇచ్చాడు. దీంతో అలంపూరుపై అధికారాన్ని కోల్పోయి బిజ్జుల వారికి కేవలం ప్రాగటూరు మాత్రమే మిగిలింది. అటుతర్వాత ప్రాగటూరును బిజ్జుల వంశీయులైన తొమ్మిది తరాల వారు పాలించారు. వీరు రచనలు, కవితలు బాగా రాసే వారు. వీరిలో ముఖ్యుడు బిజ్జుల తిమ్మ భూపాలుడు (క్రీ.శ.1689–1710). ఈయన సంస్కృతంలో ఉన్న 'అనర్ఘరాఘవము' అనే ప్రబంధాన్ని తెలుగులో రాశాడు. (దీన్ని 1977లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కేశవపంతుల నరసింహ శాస్త్రిగారి పరిష్కారంతో ప్రచురించింది)

తిమ్మభూపాలునికి ఐదు తరం వాడు పెద్ద నరసింహారెడ్డి(క్రీ.శ. 1759–1786). ఇతనిని దాయాదులు విషం పెట్టి చంపడంతో ఈయన భార్య చిన్నమ్మ ప్రాగటూరును కోల్పోయింది. అటుతర్వాత రాణి చెన్నమ్మ దేవి(క్రీ.శ.1770–1860)కి కొల్లాపూర్ సంస్థానాధీశులు ఆశ్రయం ఇచ్చి సొంత కూతురిలా చూసుకున్నారట. కొల్లాపూర్ వారికి బ్రిటీషు వారితో చక్కటి సంబంధాలు ఉండేవి. వీరు బ్రిటీషు వారి ద్వారా నిజాంను ఒప్పించి రాణి చెన్నమ్మ దేవికి చిన్న జాగీరును ఇప్పించారు. అదే పల్లెపాడు జాగీరు. ఆరు గ్రామాలతో పల్లెపాడు కేంద్రంగా రాణి చెన్నమ్మ దేవి పాలన సాగించింది.


పల్లెపాడు పూర్వపు నామం పాన్యాగ్రహి. బిజ్జుల దేవుడి ద్వారా అభివృద్ధి చెందిన జైన మత ప్రభావంతో ఈ పేరు వచ్చిందట. జైన మత ప్రాబల్యం ఉన్న చాలా ప్రాంతాల పేర్లు 'పాడ్', 'పాడు' తో పూర్తవుతాయి. ఇలా ప్రభావితం అయిన పాన్యాగ్రహిపాడ్ కాలక్రమంలో పల్లెపాడుగా మారిందని చెబుతారు.

పల్లెపాడు, ప్రాగటూరు, బోరెల్లి, క్యాటూర్, మారమునగాల, జలపురం గ్రామాలను పాలిస్తూ రాణి చెన్నమ్మ దొరసాని చక్కటి పాలన చేసింది. రాణి చెన్నమ్మ సొంత మారక నాణాలను తన పరగణాలో కొనసాగించింది. భారతదేశం గణతంత్ర రాజ్యంగా ఏర్పడే వరకు ఈ సొంత ఆర్థిక శాఖ కొనసాగింది.

రాణి చెన్నమ్మ దేవి దత్త పుత్రుడు బిజ్జుల వెంకట ధర్మారెడ్డి(క్రీ.శ. 1824–1884). ఈయన మంచి భక్తి భావాలు కలవాడు. ఈయనకు వేదాలు, ఉపనిషత్తులపై మంచి పట్టు ఉండేదట. అలంపూరులోని నవ బ్రహ్మ ఆలయాల దగ్గర యాత్రికుల కోసం సత్రాలు కట్టించారు. భక్తి, మతాలపై చాలా పుస్తకాలు కూడా ప్రచురించారు.

(సశేషం)

**వచ్చేవారం : 'పల్లెపాడు' వారసుడు అనిరుధ్‌తో ములాఖాత్**


కొండారెడ్డి బురుజు

**చాళుక్య వినయాదిత్యుని (రెండో పులకేశి మనవడు) శాసనం పల్లెపాడు గ్రామంలో లభించింది. ఒక రైతు పొలం దున్నుతుండగా ఓ కుండలో పాతి పెట్టిన మూడు రేకుల తామ్ర శాసనం దొరికింది. చరిత్ర పరిశోధకుడు, సాహితీవేత్త గడియారం రామకృష్ణ శర్మ దాన్ని పల్లెపాడు శాసనంగా విపుల వ్యాఖ్యానంతో భారతి పత్రికలో ప్రకటించి ప్రాచుర్యంలోకి తీసుకొచ్చాడు. తరువాత దాన్ని పుస్తక రూపంగానూ తీసుకొచ్చారు.**


ప్రాగటూరు కోట


రాణి చెన్నమ్మ వాడిన కత్తి


రాయచూరు కోట